

# వరల్డ్ కప్ 2023

నేటి మ్యాచ్‌లు

| | |
|---|---|
| ఆస్ట్రేలియా X న్యూజిలాండ్ | నెదర్లాండ్స్ X బంగ్లాదేశ్ |
| ఉ. 10.30 నుంచి | మ. 2.00 నుంచి |
| వేదిక: ధర్మశాల | వేదిక: కోల్‌కతా |



## శీతల్ సంచలనం

- ఆర్చరీలో రెండు పసిడి పతకాలు
- ఆసియా పారాగేమ్స్

హాంగ్జౌ: ప్రతిష్ఠాత్మక ఆసియా పారాగేమ్స్‌లో యువ ఆర్చర్ శీతల్‌దేవి సంచలనం సృష్టించింది. రెండు చేతులు లేకపోయినా.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఒకే పారా ఆసియా గేమ్స్‌లో రెండు స్వర్ణాలు సాధించిన తొలి భారత ఆర్చర్‌గా శీతల్ అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన మహిళల వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్‌లో శీతల్ పసిడి పతకాన్ని ముద్దాడింది. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో ఈ 16 ఏండ్ల యువ ఆర్చర్ 144-142తో అలిమ్‌నుర్ సయ్యేదా(సింగపూర్)పై అద్భుత విజయం సాధించింది. అదే జోరు కొనసాగిస్తూ మహిళల డబుల్స్ కాంపౌండ్ ఈవెంట్‌లో శీతల్ రజతాన్ని ఖాతాలో వేసుకుంది. జమ్ముకశ్మీర్‌కు చెందిన శీతల్‌కు పుట్టుకతోనే ఫాకోమిలియా సిండ్రోమ్ ఉంది. చేతులు లేకుండా పెరిగిన శీతల్‌ను భారత ఆర్మీ చేరదీసి శిక్షణ అందించింది. ఇదిలా ఉంటే శనివారంతో ముగియనున్న పారా ఆసియా గేమ్స్‌లో భారత్ ప్రస్తుతం 99 పతకాలతో ఆరో స్థానంలో కొనసాగుతున్నది.

## అర్జున్, తిలోత్తమకు రజతం

పారిస్ ఒలింపిక్స్ బెర్తు ఖరారు • ఆసియా చాంపియన్‌షిప్స్



ఢిల్లీ : ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత షూటర్లు అర్జున్ బబుతా, తిలోత్తమ సేన్ డబుల్ ధమాకా మోగించారు. వెండి వెలుగులు విరజిమ్మడంతో పాటు పారిస్ ఒలింపిక్స్ బెర్తు సైతం దక్కించుకున్నారు. శుక్రవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో అర్జున్ రజతం సాధించగా.. మహిళల విభాగంలో 15 ఏండ్ల తిలోత్తమ కొద్దిపాటి తేడాతో పసిడి పతకాన్ని చేజార్చుకుంది. భారత్‌కే చెందిన రమితా జిందాల్ 230.6 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యంతో సరిపెట్టుకుంది. వ్యక్తిగత విభాగంలో సత్తా చాటిన అర్జున్.. దివ్యాన్ష్ సింగ్ , హృదయ్ బృందంతో కలిసి 1892.4 స్కోర్‌తో దేశానికి స్వర్ణం అందించాడు.



*గోవా వేదికగా జరుగుతున్న నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ మహిళల నెట్‌బాల్ జట్టు కాంస్య పతకం సొంతం చేసుకుంది. తెలంగాణ, కేరళ మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్ 26-26తో టైగా ముగిసింది.*

## అర్జున్ ముందంజ

ఫిడే గ్రాండ్ స్విస్ టోర్నీ



ఇస్లే ఆఫ్ మ్యాన్ : ఫిడే గ్రాండ్ స్విస్ టోర్నీలో తెలంగాణ కుర్రాడు అర్జున్ ఎరిగేసి అదరగొడుతున్నాడు. గ్రాండ్‌మాస్టర్ అర్జున్ తన వ్యూహాత్మక ఎత్తులతో శుక్రవారం అంటోన్ గిజార్రో(స్పెయిన్)పై అద్భుత విజయం సాధించాడు. నల్లపావులతో ఆడిన అర్జున్ ఒకదశలో వెనకబడినా.. వెంటనే పుంజుకొని ప్రత్యర్థి ఆట కట్టించాడు. ఇక ఎస్‌ఎల్ నారాయణన్ రెండో రౌండ్‌లో ఉజ్బెకిస్థాన్ గ్రాండ్‌మాస్టర్ అబ్దుసత్తోరోవ్ నొడిర్బికెతో హోరాహోరాగా తలపడినప్పటికీ డ్రాతో సరిపెట్టుకున్నాడు.

## హైదరాబాద్‌కు నిరాశ

జైపూర్:ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 టోర్నీలో హైదరాబాద్‌కు నిరాశ ఎదురైంది. జైపూర్‌లో శుక్రవారం జరిగిన పోరులో హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో హర్యానాను చిత్తుచేసింది. హర్యానా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో హైదరాబాద్ 15.4 ఓవర్లలో 5 వికెట్లకు 141 పరుగులు చేసింది. అయితే పాయింట్ల పరంగా ముంబై, బరోడాతో కలిసి 24 పాయింట్లతో హైదరాబాద్ సమంగా నిలిచినప్పటికీ రన్‌రేట్ పరంగా వెనుకంజలో ఉండటంతో క్వార్టర్స్‌కు అర్హత సాధించలేకపోయింది.

## కోర్టుకు అజర్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కోట్ల రూపాయల నిధుల గోల్‌మాల్‌పై కేసులు ఎదుర్కొంటున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు అజారుద్దీన్ కోర్టును ఆశ్రయించాడు. 2020-23 మధ్య కాలంలో కోట్ల రూపాయలు నిధులు దుర్వినియోగం చేసినట్లు జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు కమిటీ తేల్చింది. గత ఆగస్టులో హెచ్‌సీఏ నిధులపై కమిటీ ఆడిట్ నిర్వహించింది. దీనిపై ఉప్పల్‌లో అజర్‌పై నాలుగు కేసులు నమోదయ్యాయి.

# సఫారీ టాప్ షో

- ఉత్కంఠ పోరులో పాక్ చిత్తు
- అగ్రస్థానానికి దక్షిణాఫ్రికా
- మెరిసిన షంసీ, మార్క్‌రమ్
- వన్డే ప్రపంచకప్




ప్రపంచకప్ ప్రారంభమైనప్పటి నుంచి దంచి కొట్టడమే పనిగా పెట్టుకున్న దక్షిణాఫ్రికా ముందు.. పాకిస్థాన్ 271 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. బిగ్ హిట్టర్లతో దట్టంగా ఉన్న సఫారీ టీమ్‌కు ఇదో లెక్కా అనుకుంటే.. పాక్ బౌలర్లు చివరి వరకు పట్టు వదలక ప్రయత్నించారు! దీంతో ఏకపక్ష పోరాటాలు వీక్షిస్తూ విసిగిపోయిన అభిమానులకు తాజా ప్రపంచకప్‌లో తొలిసారి ఉత్కంఠ పోరును ఆస్వాదించే అవకాశం దక్కింది. బంతి బంతికి ఆధిక్యం చేతులు మారుతుంటే.. ఓవర్ ఓవర్‌కు సమీకరణాలు తారుమారవుతుంటే.. ఆడుతున్నది భారత జట్టు కాకపోయినా చెన్నై చెపాక్ స్టేడియం ఈలలు, కేకలతో మార్మోగిపోయింది. ఒత్తిడిని తట్టుకోలేదనే అపవాదు ఉన్న దక్షిణాఫ్రికా కడవరకు నిలిచి గెలుపు గీత దాటింది. ఆఖర్లో ఉత్కంఠ ఊపేసినా.. చివరి వరుస బ్యాటర్లు పట్టుదల కనబర్చడంతో ఐదో విజయంతో సఫారీ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది.

చెన్నై: వన్డే ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా జైత్రయాత్ర కొనసాగుతున్నది. చివరి వరకు నువ్వా నేనా అన్నట్లు సాగిన పోరులో ఒత్తిడిని చిత్తుచేసిన సఫారీ జట్టు విజయ దుందుభి మోగించింది. చెన్నై చెపాక్ వేదికగా శుక్రవారం జరిగిన ఉత్కంఠ పోరులో దక్షిణాఫ్రికా వికెట్ తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. తాజా టోర్నీలో ఆరు మ్యాచ్‌లాడిన దక్షిణాఫ్రికా.. ఐదో విజయంతో 10 పాయింట్లు ఖాతాలో వేసుకొని టీమ్‌ఇండియాను వెనక్కి నెట్టి పట్టికలో అగ్రస్థానానికి చేరింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్.. 46.4 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ బాబర్ ఆజమ్ (50; 4 ఫోర్లు, ఒక సిక్సర్), సౌద్ షకీల్ (52; 7 ఫోర్లు) అర్ధశతకాలతో రాణించగా.. షాదాబ్ ఖాన్ (43; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), మహమ్మద్ రిజ్వాన్ (31; 4 ఫోర్లు, ఒక సిక్సర్), మహమ్మద్ నవాజ్ (24; ఒక ఫోర్, 2 సిక్సర్లు) పర్వాలేదనిపించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో తబ్రేజ్ షంసీ 4, మార్కో జాన్సెన్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 47.2 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 271 పరుగులు చేసింది. ఎయిడెన్ మార్క్‌రమ్ (91; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా.. మరే ప్లేయర్ ముప్పై పరుగుల మార్క్ దాటలేకపోయాడు. పాక్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది 3, హరీస్ రవుఫ్, మహమ్మద్ వసీమ్, ఉసామా మీర్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఈ పరాజయంతో పాకిస్థాన్ సెమీఫైనల్ దారులు దాదాపుగా మూసుకుపోగా.. షంసీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

**1** వన్డే ప్రపంచకప్‌లో వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓడటం పాకిస్థాన్‌కు ఇదే తొలిసారి.

### సంక్షిప్త స్కోర్లు

**పాకిస్థాన్:** 46.4 ఓవర్లలో 270 ఆలౌట్ (షకీల్ 52, బాబర్ 50; షంసీ 4/60, జాన్సెన్ 3/43),
**దక్షిణాఫ్రికా:** 47.2 ఓవర్లలో 271/9 (మార్క్‌రమ్ 91; షాహీన్ 3/45, ఉసామా 2/45).

### ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

| దే | ఆ | గె | ఓ | ర.రే. | పా |
|---|---|---|---|---|---|
| దక్షిణాఫ్రికా | 6 | 5 | 1 | +2.03 | 10 |
| భారత్ | 5 | 5 | 0 | +1.35 | 10 |
| న్యూజిలాండ్ | 5 | 4 | 1 | +1.48 | 8 |
| ఆస్ట్రేలియా | 5 | 3 | 2 | +1.16 | 6 |
| శ్రీలంక | 5 | 2 | 3 | -0.20 | 4 |
| పాకిస్థాన్ | 6 | 2 | 4 | -0.38 | 4 |
| అఫ్గానిస్థాన్ | 5 | 2 | 3 | -0.96 | 4 |
| బంగ్లాదేశ్ | 5 | 1 | 4 | -1.25 | 2 |
| ఇంగ్లండ్ | 5 | 1 | 4 | -1.63 | 2 |
| నెదర్లాండ్స్ | 5 | 1 | 4 | -1.90 | 2 |

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

### అద్భుతం జరిగినా కష్టమే!

'మేం అద్భుతాలను నమ్ముతాం.. వన్డే ప్రపంచకప్‌లో అవి జరుగుతాయని ఆశిస్తున్నాం' ఇది కీలక మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ వైస్ కెప్టెన్ షాదాబ్ ఖాన్ చేసిన వ్యాఖ్య. ఇప్పుడు నిజంగానే ఆ జట్టుకు ఇలాంటి అద్భుతం అవసరం పడనుంది. ఇప్పటి వరకు టోర్నీలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో నాలుగింట ఓడి 4 పాయింట్లతో పట్టికలో ఆరో స్థానంలో ఉన్న పాకిస్థాన్ సెమీఫైనల్ చేరాలంటే.. ఆ కరిష్మా తప్పనిసరి. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలోనే తమ ప్రపంచకప్ వేట ప్రారంభించిన పాకిస్థాన్.. తొలి రెండు మ్యాచ్‌ల్లో నెదర్లాండ్స్, శ్రీలంకపై అలవోక విజయాలతో ఫేవరెట్‌గా కనిపించింది. కానీ అహ్మదాబాద్ వేదికగా టీమ్‌ఇండియాతో మ్యాచ్ తర్వాత ఆ జట్టు పరిస్థితి గాలి తీసిన బెలూన్‌లా మారింది. భారత్, ఆస్ట్రేలియా, అఫ్గానిస్థాన్, దక్షిణాఫ్రికా ఇలా వరుసగా నాలుగో పరాజయం మూటగట్టుకున్న పాకిస్థాన్ ఇకపై టోర్నీలో ముందంజ వేయడం దాదాపు అసాధ్యమే. రానున్న మూడు మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్, న్యూజిలాండ్, ఇంగ్లండ్‌తో తలపడనున్న పాక్.. ఆ మూడింట భారీ తేడాతో విజయాలు సాధించడంతో పాటు మరోవైపు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉన్న ఆస్ట్రేలియా చిన్న ప్రత్యర్థుల చేతిలో సైతం ఓడాలని కోరుకోక తప్పని పరిస్థితి. ఇవన్నీ జరగడం అసాధ్యం కావడంతో.. ప్రస్తుతానికి పాకిస్థాన్ కేవలం అధికారికంగా మాత్రమే పోటీలో ఉన్నట్లు. భారత్‌తో పెట్టుకుంటే.. జట్టు భవితవ్యమే మారిపోతుందని ఆ దేశ మాజీలు సూచించినట్లే.. ఈ మెగాటోర్నీతో పాకిస్థాన్ జట్టులో పెను మార్పులు సంభవించనున్నాయి. బాబర్ ఆజమ్ కెప్టెన్సీ ఊడటం ఖాయంగా కనిపిస్తున్నది.

## నీట్ వ్యతిరేక బిల్లును ఆమోదించండి

- రాష్ట్రపతికి స్టాలిన్ విజ్ఞప్తి

చెన్నై, అక్టోబర్ 27: తమిళనాడు ప్రతిపాదించిన నీట్ వ్యతిరేక బిల్లుకు ఆమోదం తెలపాలని సీఎం స్టాలిన్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజ్ఞప్తి చేశారు. చెన్నై వచ్చిన రాష్ట్రపతికి ఈ మేరకు విమానాశ్రయంలో స్టాలిన్ లేఖ అందించారు. బిల్లుకు సంబంధించి కేంద్ర హోంశాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అడిగిన వివరణలన్నీ అందించామని తెలిపారు.

## వీధి కుక్కకు వీసా

వారణాసి, అక్టోబర్ 27: వారణాసి వీధుల్లో తిరిగే ఓ వీధి కుక్కకు మహాయోగం పట్టింది. డచ్ జాతీయురాలైన మెరల్ బొటెన్‌బల్ ఇటీవల వారణాసి వచ్చినప్పుడు జయ అనే శునకంతో అనుబంధం ఏర్పడింది. సహజంగా జంతు ప్రేమికురాలైన మెరల్.. జయను తనతో పాటు నెదర్లాండ్స్‌కు తీసుకెళ్లడానికి నిశ్చయించుకుంది. జయకు అవసరమైన వీసా, పాస్‌పోర్ట్‌ను పొందడానికి ఆమె భారత్‌లోనే ఆరు నెలల పాటు ఉండిపోయి ఎట్టకేలకు వాటిని పొందింది. త్వరలోనే జయతో నెదర్లాండ్ వెళ్లనున్నది.

# ఐదు గ్యారెంటీలకు గ్రహణం

- కర్ణాటకలో కానరాని కాంగ్రెస్ ఐదు హామీలు
- గృహజ్యోతి, యువనిధి, శక్తి, గృహలక్ష్మి, అన్నభాగ్య పథకాల అమలు అరకొరే
- సర్కారు కొర్రీలతో పేదలకు చుక్కలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో 'ఐదు గ్యారెంటీల' ప్రకటనను చూసి కాంగ్రెస్‌ను గెలిపించిన కన్నడిగుల ఆశలన్నీ అడియాసలుగా మారాయి. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు అసలు స్వరూపం బట్టబయలైంది. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, సవాలక్ష కొర్రీలతో కాలయాపన చేస్తున్న హస్తం పార్టీ తీరును అక్కడి ప్రజలు ఎండగడుతున్నారు.

**ఆరిన 'గృహజ్యోతి'**

200 యూనిట్ల వరకు ప్రతీ ఇంటికి ఉచిత విద్యుత్తు ఇస్తామన్న కాంగ్రెస్.. ఉచితం మాట అటుంచి ఎడాపెడా విద్యుత్తు కోతలు పెడుతున్నది. రాజధాని బెంగళూరులోనే రోజుకు నాలుగైదు గంటలపాటు కోతలు విధిస్తున్నది. ప్రచారం కోసం కొన్ని ఇండ్లకు ఉచిత కరెంటు సరఫరా చేసిన సర్కారు.. ఇప్పుడు అధిక బిల్లులతో వాత పెడుతున్నది.



రిక్త హస్తం

**భాగ్యంలేని 'అన్నభాగ్య'**

ఎన్నికల సమయంలో 'అన్నభాగ్య' స్కీమ్‌ను ఆర్భాటంగా ప్రచారం చేసిన కాంగ్రె స్.. అధికారంలోకి రాగానే బియ్యం దొరకటం లేదంటూ గగ్గోలు పెట్టింది. 10 కిలోల బియ్యాన్ని 5 కిలోలకు తగ్గించి రైస్ బదులు డబ్బులు ఇస్తామని ప్రకటించి అంతలోనే మెలికపెట్టింది. గతంలో రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేసిన బియ్యానికి కిలోకు ఎంతధర ఉండేదో అంతే ఇస్తామని చెప్పింది. నెలకు ఒక్కో ఖాతాలో కిలో బియ్యానికి రూ.34 జమ చేసింది. అదీ పూర్తిగా చేయట్లేదు.

**సత్తువ కోల్పోయిన 'శక్తి'**

శక్తి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించటంతో కర్ణాటక ఆర్టీసీ దివాలా తీసే పరిస్థితికి వచ్చింది. అంచనాకంటే 8 రెట్లు ఎక్కువ ఖర్చుచేయాల్సి వచ్చింది. డీజిల్‌కు కూడా డబ్బులు లేక అనేక మార్గాల్లో బస్సులను నడపడాన్ని సర్కారు నిలిపేసింది. గతంలో 5-10 నిమిషాలకు వచ్చే ఒక్కో బస్సు, ఇప్పుడు 40 నిమిషాలకు కూడా రావట్లేదని 'ది హిందూ' న్యూస్ పేపర్ ఇటీవల చేసిన సర్వేలో మహిళలు భగ్గుమన్నారు.

**పైసలు లేని 'గృహలక్ష్మి'**

ప్రతీఇంటి మహిళా పెద్ద బ్యాంకు ఖాతాలో నెలకు రూ. 2 వేల చొప్పున జమ చేస్తామన్న కాంగ్రెస్.. ఇప్పటికీ ఆ హామీని నిలబెట్టుకోలేదు. కొందరికి.. అదీ ఒక్క నెల మాత్రమే చెల్లించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చట్లేదని, గృహలక్ష్మి స్కీమ్ కింద ఇస్తామన్న రూ. 2000ను ఎందుకు ఇవ్వట్లేదని ఏకంగా సీఎం సిద్ధరామయ్యనే పదుల సంఖ్యలో మహిళలు నిలదీశారంటే హామీల అమలులో కాంగ్రెస్ చిత్తశుద్ధి ఏమిటో అర్థంచేసుకోవచ్చు.

**'యువనిధి' నిర్వీర్యం**

డిగ్రీ పాసైన యువతకు నెలకు రూ.3000, డిప్లొమా చేసినవారికి రూ. 1500ను నిరుద్యోగ భృతిగా చెల్లిస్తామన్న పార్టీ ఆ హామీని పక్కనబెట్టింది. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నది. కాంగ్రెస్ మోసాన్ని గ్రహించిన నిరుద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్నారు.

## ప్రత్యేక జెండా, రాజ్యాంగానికి అంగీకరించకపోతే శాంతి చర్చలకు గుడ్‌బై

కేంద్రానికి ఎన్‌ఎస్‌సీఎన్-ఐఎం హెచ్చరిక

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: ప్రత్యేక జెండా, రాజ్యాంగం కోసం తాము చేస్తున్న డిమాండ్లను అంగీకరించాల్సిందేనని ఎన్‌ఎస్‌సీఎన్-ఐఎం(నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ ఇసాక్-ముయివా) సిద్ధాంతకర్త ఆర్‌హెచ్ రాయ్‌సింగ్ కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేశారు. లేకపోతే శాంతి చర్చల నుంచి నిష్క్రమిస్తామని ఆయన హెచ్చరించారు. మణిపూర్‌లోని ఉఖ్రుల్ జిల్లాలో ఈ నెల 25న నాగా నేతలు నిర్వహించిన ప్రజా సంప్రదింపుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాము డిమాండ్ చేస్తున్న ప్రత్యేక జెండా అంశం తుది దశలో ఉన్నదని, ప్రత్యేక రాజ్యాంగానికి సంబంధించిన అంశంపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ రెండు డిమాండ్లకు నరేంద్రమోదీ సర్కారు అంగీకరించకపోతే కాల్పుల విరమణ నుంచి నిష్క్రమించేందుకు ఎన్‌ఎస్‌సీఎన్-ఐఎం సిద్ధంగా ఉన్నదని రాయ్‌సింగ్ స్పష్టం చేసినట్టు 'సంగై ఎక్స్‌ప్రెస్' పత్రిక వెల్లడించింది.

## ఎన్డీఏ కూటమిలో భాగస్వాములం కాలేం

- కేరళ జేడీ(ఎస్) స్పష్టీకరణ

కోచి: మాజీ ప్రధాని దేవెగౌడ నేతృత్వంలోని జేడీఎస్‌కు కేరళలో చుక్కెదురైంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమిలో తాము భాగస్వాములం కాదల్చుకోలేదని అధికార ఎల్డీఎఫ్ భాగస్వామిగా ఉన్న జేడీ(ఎస్) కేరళ యూనిట్ అధిష్ఠానానికి స్పష్టం చేసింది. పార్టీ జాతీయ కమిటీ చేసిన తీర్మానానికి ఇది విరుద్ధమని పేర్కొంది. ఎన్డీఏతో పొత్తుపెట్టుకోవాలని పార్టీ చీఫ్ హెచ్‌డీ దేవెగౌడ తీసుకున్న నిర్ణయాన్ని పార్టీ జాతీయ నాయకత్వం ఆమోదించలేదని స్పష్టం చేసింది. ఎన్డీఏతో పొత్తు పెట్టుకోవాలని దేవెగౌడ, ఆయన కుమారుడు కుమారస్వామి ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని జేడీఎస్ కేరళ యూనిట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాథ్యూ టీ థామస్ అన్నారు.

## భారత ప్రయాణికులపై ఎల్ సాల్వెడార్ బాదుడు

- రూ.94 వేల ట్రావెల్ ట్యాక్స్

న్యూఢిల్లీ: తమ దేశం గుండా అమెరికాకు వలసలను అడ్డుకోవడానికి ఎల్ సాల్వెడార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇండియా, 50కి పైగా ఆఫ్రికా దేశాలకు చెందిన ప్రయాణికుల నుంచి వ్యాట్‌తో కలిపి రూ.94 వేల రుసుము వసూలు చేస్తున్నది. ఎల్ సాల్వెడార్ పోర్ట్ అథారిటీ వెబ్‌సైట్‌లోని ఇటీవలి ఓ ప్రకటన ప్రకారం 23 నుంచి ఈ రుసుము వసూలు చేస్తున్నారు. తమ దేశ ప్రధాన విమానాశ్రయాన్ని ప్రయాణికులు ఎక్కువగా ఉపయోగించుకుంటూ ఉండటం వల్ల ఈ పన్ను విధిస్తున్నట్టు వెల్లడించింది. ఆఫ్రికా, ఇతర దేశాలకు చెందిన చాలా మంది వలసదారులు మధ్య అమెరికా ద్వారా అమెరికాలోకి ప్రవేశిస్తారు.





## జియో నుంచి శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు

ఇక మారుమూల ప్రాంతాలకూ ఇంటర్నెట్

న్యూఢిల్లీ, అక్టోబర్ 27: దేశంలోని అతి పెద్ద ప్రైవేట్ టెలికం రిలయన్స్ జియో శాటిలైట్ ఆధారిత ఫైబర్ సర్వీసెస్‌ను విజయవంతంగా అమలు చేసింది. దేశంలో ఇప్పటి వరకు ఇంటర్నెట్ సదుపాయం లేని గ్రామాలకు వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించడమే లక్ష్యంగా దీనిని అమలు చేసినట్టు రిలయన్స్ జియో ప్రకటించింది. దీనిని జియో స్పేస్ ఫైబర్‌గా పిలుస్తున్నారు. భారత మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో శుక్రవారం దీనిని విజయవంతంగా ప్రదర్శించింది. దేశంలోనే అత్యధిక సబ్‌స్క్రైబర్లను కలిగిన జియో ఇప్పటికే జియో ఫైబర్, జియో ఎయిర్‌ఫైబర్ వంటి బ్రాడ్‌బ్యాండ్ సర్వీసులను అందిస్తున్నది. ఇప్పుడు వీటికి అదనంగా జియో స్పేస్ ఫైబర్‌ను కూడా తీసుకొచ్చింది. ఈ సేవలతో దేశంలోని ప్రతి ప్రాంతానికీ ఇంటర్నెట్ సేవలు అందుతాయని రిలయన్స్ జియో తెలిపింది.

## స్పాంజ్ బాంబులతో సొరంగాలకు చెక్

- ఇజ్రాయెల్ సైన్యం సరికొత్త అస్త్రం



గాజా సిటీ, అక్టోబర్ 27: గాజాలో హమాస్ నిర్మించిన సొరంగాల నెట్‌వర్క్‌ను అంతమొందించడానికి ఇజ్రాయెల్ స్పాంజ్ బాంబులను వినియోగిస్తున్నది. వీటిని సొరంగాల్లో వేసినప్పుడు.. ఇందులోని రసాయనాలు కలిసి వెంటనే భారీగా నురగ విడుదల అవుతుంది. ఇది వేగంగా గడ్డకట్టి సొరంగం మూతపడుతుంది. గాజా భూగర్భంలో కొన్ని వేల కిలోమీటర్ల మేర టన్నెల్స్ నిర్మించారు. ఇజ్రాయెల్ సైన్యానికి ఇవి పెను సవాల్ విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో సొరంగాల నెట్‌వర్క్‌ను దెబ్బతీసేందుకు ఇజ్రాయెల్ సైన్యం సిద్ధమవుతున్నది. సొరంగాలలో హమాస్ మిలిటెంట్లకు భారీగా ఆయుధ నిల్వలు ఉన్నాయి. వీటిని మూసివేయడం ద్వారా హమాస్‌కు భారీ ఎదురుదెబ్బ తగలనుంది.

**కొనసాగుతున్న భూతల దాడులు**


ఫైటర్ జెట్లు, డ్రోన్లతో ఇజ్రాయెల్ దళాలు శుక్రవారం గాజాపై భూతల దాడులు నిర్వహించాయి. యుద్ధం కారణంగా పాలస్తీనాలో మరణాల సంఖ్య 7,300కు చేరుకుంది. గాజాలోని పలు భవనాలు పూర్తిగా ధ్వంసమైనట్టు శాటిలైట్ చిత్రాల ద్వారా తెలిసింది. ఇజ్రాయెల్ సరిహద్దులోని టాబాలో జరిగిన డ్రోన్ దాడి కారణంగా ఆరుగురు గాయపడ్డారని ఈజిప్ట్ సైన్యం తెలిపింది. యుద్ధ భయంతో గాజాలో 1.4 మిలియన్ల మంది ఇండ్లు వదిలి పారిపోయారు. వారిలో సగం మంది ఐక్యరాజ్యసమితి శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు అమెరికా యుద్ధ విమానాలు ఉత్తర సిరియాపై దాడులు నిర్వహించాయి. ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్ అమెరికా సేనలపై దాడులు చేశాకే తాము ఈ దాడులు చేశామని పెంటగాన్ తెలిపింది.

## అమెరికా యుద్ధవిమానం సమీపానికి చైనా ఫైటర్ జెట్

బ్యాంకాక్: దక్షిణ చైనా సముద్రంపై చైనా కవ్వింపు చర్యకు దిగింది. అమెరికాకు చెందిన బీ-52 బాంబర్ ఆకాశంలో ఎగురుతుండగా.. దానికి అత్యంత సమీపంగా చైనా యుద్ధ విమానం షెన్యాంగ్ జే-11 వేగంగా దూసుకొచ్చింది. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బీ-52కు పది అడుగుల సమీపానికి చైనా విమానం రావటంపై అమెరికా మిలటరీ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'రెండు యుద్ధ విమానాలు ఢీకొనే పరిస్థితి తలెత్తింది' అని యుఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్ శుక్రవారం పేర్కొన్నది. ఈ తరహా ఘటన ఈ ఏడాది మేలో చోటుచేసుకుంది. అమెరికానే కవ్వింపు చర్యలకు దిగుతున్నదని, తమ దేశానికి కొన్ని మైళ్ల దూరంలో అమెరికా మిలటరీ విమానాలు బలప్రదర్శనకు దిగుతున్నాయని చైనా ఆరోపించింది. దక్షిణ చైనా సముద్ర జలాల్లో కృత్రిమ దీవుల్ని సృష్టిస్తూ.. సముద్ర జలాలపై తమకే హక్కు ఉందని చైనా చాలా ఏండ్లుగా వాదిస్తున్నది. ఈనేపథ్యంలో ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, జపాన్.. తదితర దేశాలతో చైనాకు వివాదాలు నెలకొన్నాయి.

## భారత దళాలు వెళ్లిపోవాలి

మాల్దీవుల కొత్త అధ్యక్షుడు



మాలే, అక్టోబర్ 27: తమ దేశంలో మోహరించిన భారత సైనిక దళాలు వెళ్లిపోవాలని, తాము పూర్తి స్వతంత్రంగా ఉండాలనుకుంటున్నామని మాల్దీవులకు కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు పేర్కొన్నారు. లక్షదీవులకు దిగువన ఉండే మాల్దీవుల ప్రాంతంలో ఆధిపత్యం కోసం భారత్, చైనా ప్రయత్నిస్తున్నాయి. ప్రస్తుత అధ్యక్షుడు ఇబ్రహీం సోలీహ్ దేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకొనేందుకు భారత్‌కు అనుమతించాడని, భారత దళాలను అనుమతించడం ద్వారా దేశ సార్వభౌమత్వాన్ని స్వాధీనం చేశాడని ఎన్నికల ప్రచారం సందర్భంగా ముయిజ్జు ఆరోపించారు. దీనిని బట్టి భారత వ్యతిరేకతతోనే ముయిజ్జు ఎన్నికల్లో లబ్ధి పొందినట్టు విదితమవుతున్నది. సైనిక దళాల తొలగింపుపై ఇప్పటికే తాను భారత ప్రభుత్వంతో చర్చించానని, అవి విజయవంతమయ్యాయని ముయిజ్జు చెప్పారు. సుమారు 70 మంది భారత సైనిక సిబ్బంది ఇక్కడ రాడార్ల వ్యవస్థను, నిఘా విమానాలను పర్యవేక్షిస్తున్నారు. ఇక భారత యుద్ధనౌకలు మాల్దీవుల ప్రత్యేక ఆర్థిక జోన్‌లో గస్తీకి సహకరిస్తున్నాయి. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను కోరుకుంటున్నామని ముయిజ్జు చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.